క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ గాంధీనగర్ ఫీడర్ లైన్ పనులు జరుగుతున్నందున పట్టణంలోని గాంధీనగర్, ఇస్లాంపురం, కారంమిల్లులు, షాబునగర్, రాంనగర్, కలల్‌వాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో వన్‌టౌన్ ఏఈ పి.మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సాయుధ పోరాట యోధుడు రంగయ్యకు నివాళి



రంగయ్య పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కన్నెగంటి రంగయ్య పార్థీవదేహాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, యాదమ్మ, చిమట ఆంజనేయులు, శ్రీనివాస్, రవి, ఎల్లయ్య, నాగేందర్, శ్రీను, ఉపేందర్, సుధాకర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అల్పాహారం పంపిణీ

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆల్ లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో శనివారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ మరింత సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎం.నాయుడు, యనగండ్ల లింగయ్య, వెంకటేశం, సింగు రాంబాబు, వనిత, స్వప్న, మధు, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

దేవరకొండ: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఉన్న స్టాక్, కేటాయించిన స్టాక్ వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై చర్యలుంటాయన్నారు.యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

జావిద్‌కు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : వేములపల్లి మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే జావిద్ 'ముస్లింవాద సాహిత్యం–సామాజిక వాస్తవికత' అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఈ సందర్భంగా స్థానిక సరాయే మీరాలంలో ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జావిద్‌ను ఘనంగా సత్కరించారు. సీనియర్ జర్నలిస్టులు ఖాజాహమీదుద్దీన్, ఎండి అస్లాం, ఎండి అయ్యూబ్, ఎండి నాహీద్, జాహీంగీర్ అలీ, ఎంఏ మన్నాన్, ఖైసర్, జానీ, ఫర్వేజ్, అజిముద్దీన్, నవాజ్, నజీర్, మొజన్, మహిమూద్ అలీ, ఆరీఫ్ అలీ, ముజీబ్, మొయిద్, జుబేర్, అబ్బాస్, రజాఖాద్రి, సలాఖాద్రి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

హాలియా : ఇటీవల మృతి చెందిన బత్తుల తిరుపతయ్య యాదవ్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ శనివారం పరామర్శించారు. హాలియాలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిరుపతయ్య యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్ రెడ్డి, నాయకులు సురభి రాంబాబు, పాదిల శ్రీనివాస్, కృష్ణ యాదవ్, సైదాచారి, కాశయ్య, మహిళా అధ్యక్షురాలు గడ్డం రమణ, కిలారి కృష్ణ, బూడిద గోవింద్, గురజాల సైదులు, గడ్డం సోము, పిల్లి వెంకట్, బుర్రి సందీప్ పాల్గొన్నారు.

తప్పని యూరియా తిప్పలు



పెద్దవూర పీఏసీఎస్ ముందు యూరియా కోసం నిల్చున్న రైతులు



వెనిగండ్ల సహకార సంఘం వద్ద క్యూలైనులో రైతులు

పెద్దవూర : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. పెద్దవూర మండలంలోని పలు గ్రామాల నుంచి ఉదయం నాలుగైదు గంటలకే పీఏసీఎస్ వద్దకు చేరుకుని క్యూలో నిలబడుతున్నారు. శనివారం యూరియా కోసం మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్దకు రైతులు భారీగా తరలివచ్చారు. రైతుల నుంచి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లను తీసుకుని ఈ నెల 11, 12వ తేదీల్లో ఇచ్చిన కూపన్లకు మొదట, ఆ తర్వాత మిగిలిన రైతులకు రెండు బస్తాల చొప్పున 880 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. అయినా చాలామంది రైతులకు యూరియా దొరకకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

మాడుగులపల్లి: యూరియా కోసం మండల రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు శనివారం 400 బస్తాల యూరియా వచ్చిందన్న సమాచారం అందుకున్న రైతులు అధిక సంఖ్యలో హుటాహుటిన అక్కడికి చేరుకొని చెప్పులను, ఆధార్‌కార్డులను లైన్‌లో పెట్టి యూరియా కోసం వేచి ఉంచారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండలానికి కేవలం 400 బస్తాల యూరియా వచ్చిందని అధికారులు చెబుతున్నారని, కానీ అవి ఏమాత్రం రైతులకు సరిపోవడం లేదని వెంటనే ఇంకా కొన్ని లారీల యూరియాను రప్పించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు.

త్రిపురారం : యూరియా సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మండల రైతులు శనివారం త్రిపురారం ప్రధాన సెంటర్‌లో సాగర్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. టోకెన్లు ఒకసారి, యూరియా మరోసారి పంపిణీ చేయడంతో రైతులు రోజులు తరబడి తమ వ్యవసాయ పనులను వదిలి వరుసల్లో వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. అనంతరం రైతు వేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం రైతులు భారీగా వరుసలో నిలబడ్డారు. అలాగే పెద్ద దేవులపల్లి, బాబుసాయిపేట ప్రాథమిక సహకార సంఘాల వద్ద కూడా యూరియా కోసం రైతులు తమ చెప్పులను వరుసలో పెట్టి ఎదురు చూశారు.

నిడమనూరు : యూరియాకోసం రైతుల పోరు కొనసాగుతోంది. నిడమనూరు సహకార సంఘం ఎదుట శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు రైతులలు యూరియా కోసం ఎదురు చూశారు. నిడమనూరు సహకార సంఘానికి శనివారం 40 టన్నులు, వెనిగండ్ల సహకార సంఘానికి 20 టన్నులు, ముప్పారం రైతు వేదిక వద్దకు 20 టన్నుల యూరియా వచ్చింది. అయితే నిడమనూరు సహకార సంఘానికి 800 మందికిపైగా రాగా ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున 444 మంది రైతులకు పంపిణీ చేశారు. రోజంతా క్యూలైనులో ఉన్న యూరియా దొరకడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా దొరకని రైతులకు కూపన్లు ఇవ్వాలని, మరుసటి రోజు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. క్యూలైనులో ముందు వరుసలో ఉండాలని శుక్రవారం రాత్రి పలువురు రైతులు సహకార సంఘం వద్దే నిద్రపోయారు. ఇప్పటివరకు నిడమనూరు సహకార సంఘం వద్ద 898 టన్నులు, వెనిగండ్లలో 320 టన్నుల యూరియా పంపిణీ చేశారు. యూరియా అర్హులైన, అవసరం ఉన్న రైతులకు అందడంలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా సహకార సంఘం ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.



మాడుగులపల్లి పీఏసీఎస్ వద్ద చెప్పులు, టోకెన్లను క్యూలైన్‌లో ఉంచి వేచి ఉన్న రైతులు



నిడమనూరు సహకార సంఘం వద్ద క్యూలైనులో రైతులు

ఉన్నతాధికారుల వేధింపుల నుంచి కాపాడండి



మాట్లాడుతున్న బాధితుడు సంజీవ రెడ్డి

పంజగుట్ట : ఉన్నతాధికారుల వేధింపుల నుండి తనను కాపాడాలని నల్లగొండ జిల్లా, హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు జూనియర్ లెక్చరర్ నీరుడు సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రిటైర్డ్ హిందీ పండిట్ హరిహరనాథ్ గుప్తతో కలిసి ఆయన మాట్లాడుతూ .. కళాశాల ప్రిన్సిపాల్, మరో ఇద్దరు ఉన్నతాధికారులు తనపై కక్ష్యకట్టి వారిని కులం పేరుతో తాను వేధిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. తాను ఇదే విశయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఎలాంటి విచారణ చేయకుండా వికారాబాద్‌కు బదిలీ చేశారని తెలిపారు. అక్కడ తెలుగు పోస్టు లేకపోవడంతో తాను హైకోర్టును ఆశ్రయించానని, కోర్టు బదిలీ ఉత్తర్వులు రద్దు చేస్తూ విచారణ జరిగేవరకు హాలియా కళాశాలలోనే విధులు కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఐదున్నర నెలల తరువాత పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. తననే కాకుండా ఎంతో మంది ఉద్యోగులను ఈ ఉన్నతాధికారులు వేధిస్తున్నారని వారిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నారయ్య మృతి పార్టీకి తీరని లోటు

డిండి : మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు వొడ్డెమాను నారయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖానాపూర్‌లో నిర్వహించిన నారయ్య సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నారయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనొద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు విజయేందర్‌రెడ్డి, శైలేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్ : ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి క్రీడాపోటీలలో నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్–14, అండర్–17 విభాగాలలో పలు పతకాలు సాధించారు. ఈ పోటీలు గన్నెకుంట గ్రామంలోని సెయింట్ థామస్ పాఠశాలలో జరిగాయి. నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు కబడ్డీలో అండర్–17 విభాగంలో ప్రథమ బహుమతి, అండర్–14 విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. ఖోఖోలో అండర్–17, అండర్–14 విభాగాలలో ప్రథమ బహుమతి సాధించారు. వాలీబాల్‌లోనూ అండర్–17, అండర్–14 విభాగాలలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ విజయాలతో విద్యార్థులు తిరుమలగిరి (సాగర్) మండలంలో జరగబోయే నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎత్తిపోతల పథకం నిర్వహణలో ప్రభుత్వం విఫలం

నాగార్జున సాగర్ : ఎడమ కాలువ ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని భగత్ అన్నారు. ఎల్–3 ఎత్తిపోతల పథకం ఇన్‌లెట్ వెల్ (బావి) కూలి ఏడాది కావస్తున్నా, సాగునీరు అందించడంలో ప్రస్తుత ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. సాగునీటి పారుదల శాఖాధికారులతో సమీక్షించి, పనులను వేగవంతం చేసి ఎల్–3 ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఏఈ జగపతిబాబు మాట్లాడారు. ఇన్‌లెట్ బావి పనులు మూడు లెవెల్స్ వరకు పూర్తయ్యాయని, మరో ఐదు లెవెల్స్‌తో కలిపి మొత్తం 7.5 మీటర్ల ఎత్తు వరకు పనులు పూర్తవుతాయని వివరించారు. ఇన్‌లెట్ నిర్మాణం పూర్తి కాగానే పైపులు బిగించి సాగునీరు అందిస్తామని తెలిపారు.

ట్రాక్టర్‌పై ఎత్తిపోతల పథకం వద్దకు..

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎత్తిపోతల పథకానికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో మాజీ ఎమ్మెల్యే భగత్ శనివారం స్థానిక రైతులతో కలిసి ట్రాక్టర్‌పై అక్కడికి చేరుకున్నారు. ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, యువజన నాయకుడు పిల్లి రాజు, బొల్లం సైదులు, మెరుగు రామలింగయ్య, జక్కల శ్రీను, నాగరాజు గౌడ్, దాసు, నల్లమోతు వెంకటేశ్వర్లు, కాట్నం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకం ఎల్–3ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

నిడమనూరు: ప్రభుత్వ పాలనా వైఫల్యం కారణంగానే రైతులు యూరియా కొరతను ఎదుర్కొంటున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం ఆయన నిడమనూరు శివారులోని ఎల్–3 ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సాగర్ నియోజకవర్గానికి పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల నియోజకవర్గంలో ఎలాంటి యూరియా కొరత లేదని తెలిపారు. కానీ తెలంగాణలో కనీసం యూరియా నిల్వలు, బఫర్ స్టోరేజీ లేకపోవడం బాధాకరమన్నారు. రైతులు ఎంత సాగు చేస్తున్నారో చూడకుండా ఆధార్ కార్డుకు ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో ఒక బస్తా కోసం కుటుంబమంతా పడిగాపులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజీతో ఇద్దరూ విజయం సాధించినట్లే



మిర్యాలగూడ టౌన్ : లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి వేణు



దేవరకొండ: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

మిర్యాలగూడ టౌన్ : జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకుంటే ఇరువర్గాల వారు విజయం సాధించినట్లేనని మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు అవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్యరాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌తేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ లోక్‌అదాలత్‌లో 164కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యర్శులు నేతి సత్యానారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, జాతీయ లోక్ అదాలత్ సభ్యులు ఎస్ఆర్‌కె ప్రభాకర్, డి. రాజశేఖర్, ఎం మల్లేష్, కోంక వెంకన్న, డి. మల్లేష్, రామకృష్ణ, అనంతుల గంగాభవాని, ఎం.కుమార్‌రెడ్డి, కె. శ్రీనివాస్, సుశ్మిత, ఏపీపీ ర ఘురామారావు, పీపీలు సుధాకర్, దీపారాణిలతో పాటు సినియర్, జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

దేవరకొండ : రాజీమార్గమే రాజమార్గం అని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత పేర్కొన్నారు. శనివారం దేవరకొండ మున్సిఫ్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించు కోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్ హరీష్‌బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్నేహ, ఏపీపీలు సంతోష్‌కుమార్, రూపాంజలి, సీఐ వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు ఉమా మహేష్ యాదవ్, నెమ్మికంటి రమాశంకర్, గౌరీశంకర్, గాజుల ఆంజనేయులు, చెనగాని అశోక్, వనం జగదీష్, ఇడెం రవి, గణేష్, శంకర్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1377 కేసుల పరిష్కారం

నిడమనూరు : లోక్‌అదాలత్‌లో భాగంగా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం 1377 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీ పడిన కేసులు 27, నేరము అంగీకరించిన కేసులు 126, డ్రంక్ డ్రైవ్ కేసులు 522, పిటి, న్యూసెన్స్ కేసులు 702 పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ జడ్జి టి.స్వప్న, బార్ సెక్రటరీ ఉన్నం చిన వీరయ్య, న్యాయవాదులు వినోద్, వెంకన్న నాయక్, జార్జీ రవి, మట్టయ్య, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే



హాలియా : మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

హాలియా : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. శనివారం హాలియా పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట నాగార్జున సాగర్ నియోజకవర్గ స్థాయి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిజాం పాలనలో జరుగుతున్న దోపిడీ, పీడన, వెట్టిచాకిరీ, దొరలు, జమీందారులకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో కమ్యూనిస్టు యోధులు ఎన్నో త్యాగాలు చేసి ప్రజలకు అండగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, మూడు వేల గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, వెట్టిచాకిరీ రద్దయిందని, జమీందారులను గ్రామాల నుంచి తరిమికొట్టారని తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించి ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందూ ప్రజలు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు దైద శ్రీను, దుబ్బా రాంచంద్రయ్య, కందుకూరు కోటేష్, జటావత్ రవి నాయక్, మండల కమిటీ సభ్యులు ఆకారపు నరేష్, కారంపూడి ధనమ్మ, కోరే రమేష్, మల్లికంటి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వెంపటి మహేష్, కొండేటి సామంతు, వర్షిత్, పాదిల వెంకన్న, ఎస్‌కే జానీ, మల్లయ్య, కొండల్, అనిల్, రంగా, కమల, మంగ, శాంతి పాల్గొన్నారు.



మిర్యాలగూడ అర్బన్ : వారోత్సవాల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

వారోత్సవాలను విజయవంతం చేయాలి

దేవరకొండ : ఈనెల 17వరకు నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పద్మట్‌పల్లిలోని అమర వీరుల స్మార స్థూపం వద్ద నివాళులర్పించి దేవరకొండ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, ఎండీ.మైనొద్దీన్, దేప సుదర్శన్ రెడ్డి, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, రంగారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో గల దేవరకొండ రాములు స్మారకస్థూపం వద్ద నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ మతతత్వ విద్వేషాలను రెచ్చకొట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దిరాల రాంగారెడ్డి, మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, ఉదయ్‌కుమార్, బిల్లా కనకయ్య, ఎండి.సయ్యద్, లింగానాయక్, వెంకన్న, గోగుల యాదగిరి, ఎర్రబోతు పద్మ, శాంతి, మట్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఆశమ్మ, భద్రమ్మ, వీరయ్య, నర్సమ్మ, కోటేష్, నర్మద, సైదులు, నవాబు పాల్గొన్నారు.

ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీసీ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలను బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీడయ్య యాదవ్, నాయకులు నాగేశ్వర్‌రావు, వెంకటేష్, గంగాధర్, నరేష్, శంకర్, ప్రసాద్, సతీష్, వినయ్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

నాగార్జునసాగర్ : పెద్దవూర మండలంలోని సిద్ధార్థ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2007–08 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం నాగార్జునసాగర్‌లోని యూత్ హాస్టల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ పాఠశాల కరస్పాండెంట్ సలికంటి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు కర్న సైదిరెడ్డి, ఉపాధ్యాయుడు నర్సింహను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అభినయ్, రూప, ప్రియాంక, ఆదిరాల శేఖర్, రమణ, మానస, నరేష్, పద్మ, జనార్దన్, అంజలి, రేణుక, మల్లిఖార్జున్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డికాలనీలో శ్రమదానం



మట్టితో గుంతలను పూడ్చిస్తున్న శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రెడ్డికాలనీలో ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను శనివారం మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పూడ్చివేశారు. 20వ వార్డు రెడ్డికాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ గుంతలు పడి వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే మెయిన్ రోడ్లలోని లింకులను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకట్‌రెడ్డి, మండడి రవీందర్‌రెడ్డి, ఓరుగంటి శివ, సముద్రాల మదన్‌మోహన్, రాజీ, చిట్ల శ్రీనివాస్, నంద్యాల కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచకుంటే రాజకీయ మూల్యం తప్పదు

మిర్యాలగూడ టౌన్ : సామాజిక పింఛన్లను పెంచకుంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయ మూల్యం తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ జాతీయ నేత దైద సత్యం మాదిగ, ఎంఎస్పీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, విహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ హై మద్ ఖాన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్య సమాజ్ మందిరంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం పట్టణ అధ్యక్షులు ఉబ్బపల్లి రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 15న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మోహన్, పట్టణ అధ్యక్షుడు దైద శ్రీనివాస్, ఉబ్బపల్లి నాగరాజు, వెంకట్, శరత్, రాజ్ కుమార్, మధన్‌నాయక్, సైదులు, నర్సింహ్మనాయక్, అఫ్సర్, సుధాకర్, విజయ్, సురేష్ ఉన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



బంగారుకుంటతండలో వీధుల్లో పారుతున్న మురుగు

అడవిదేవులపల్లి : మండలంలోని బంగారుకుంటతండా గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలోని పలు వీధుల్లో మురుగు కాల్వలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. రోడ్లపై గుంతలు ఏర్పడి మురుగు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని దీంతో విషజ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డ్రెయినేజీ, పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరచాలని తండవాసులు కోరుతున్నారు.